# ప్రజాశక్తి

మంగళవారం 2 మే 2023 8 పేజీలు




ప్రకాశం



బాపట్ల



ఉపాధ్యాయ ఉద్యమానికి స్ఫూర్తి 'దాచూరి' ▶ 7లో

# అరుణ పతాక రెపరెపలు

- ప్రకాశం, బాపట్లలో ఘనంగా మేడే వేడుకలు
- కార్యాలయాలు.. కార్మికవాడల్లో ఎగిరిన ఎర్రజెండాలు
- హక్కులను కాపాడుకునేందుకు పోరాటాలు తప్పవని నేతల పిలుపు



చీమకుర్తిలో మోటారుసైకిల్ ర్యాలీ

**ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, బాపట్ల**

అంతర్జాతీయ కార్మిక హక్కుల దినం మేడేను ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, కార్మికవాడలు, ఫ్యాక్టరీల్లో ఎర్రజెండాలు రెపరెపలాడాయి. పట్టణాల్లో వివిధ రంగాల కార్మికులు మేడే వేడుకల్లో పాల్గొన్నారు. ర్యాలీలు నిర్వహించారు. జెండాలను ఎగురవేశారు. కార్మిక సంఘ నేతలు పాల్గొని ప్రసంగించారు. అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో ఎర్రజెండాలు రెపరెపలాడాయి. సిఐటియు, ఏఐటియుసీ, ఇతర కార్మిక సంఘాలు, ఆయా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జెండాలు ఎగురవేశారు. చీమకుర్తిలో కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. బాపట్లలో సిఐటియు ఆధ్వర్యంలో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్, పంచాయతీ, ముఠా, గ్రానైట్, పలకలు, పొగాకు ఇతర పరిశ్రమల్లో కార్మికులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. నాయకులు హాజరై ప్రసంగించారు. నూటయాభై ఏళ్ల క్రితం పోరాడి సాధించుకున్న పనిగంటలు, ఇతరహక్కులను కాపాడుకునేందుకు మేడే స్ఫూర్తితో పోరాటాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇపుడు కార్మికులు సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నాయని, కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్నాయని కార్మిక సంఘాల నేతలు ▶ 2లో



బాపట్లలో ఎర్ర జెండాను ఆవిష్కరిస్తున్న గంగయ్య, మజుందర్

# వానొచ్చే..నష్టం మిగిల్చే..

- వర్షంతో తడిసిన ముద్దయిన మొక్కజొన్న
- కరిగి ముద్దగా మారిన ఇటుక
- ఆందోళనలో రైతులు ఇటుకబట్టీల యజమానులు



లంక గ్రామాలలో వర్షానికి తడిసిన ఇటుక

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

మండలంలో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ఉదయం ఐదు గంటలకు ప్రారంభమైన వాన సుమారు గంటసేపు భారీగా కురిసింది. దీంతో రహదారులు ఎక్కడికక్కడ జలమయమయ్యాయి. మాగాణి భూముల్లో ఉన్న మొక్కజొన్న పంట తడిసి ముద్దయ్యింది. లంక గ్రామాలలో విస్తరించిన ఇటుక పరిశ్రమకు తీవ్ర ఆటంకం కలిగింది. పచ్చి ఇటుక కల్లాలలో నీరు చేరి.. కరిగిపోయింది. కొంతమేర ఇటుక ఎండిపోయినా.. దానిని గుట్టలుగా చేసి పరదాలు కప్పినప్పటికీ అధిక వర్షానికి నీరు నిలబడి గుట్టల కింద ఇటుక కరిగి ముద్దయ్యిందని బట్టీల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మూడు విడతలుగా కురిసిన వర్షానికి లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లిందని వాపోతున్నారు.

డెల్టా ప్రాంతంలో రబీలో సాగు చేసిన మొక్కజొన్న, జొన్న పంట 50 శాతం పైగా నేటికీ పొలలోనే ఉంది. వేలాది ఎకరాలలో మొక్కజొన్న కండె దశలోనే ఉండగా గుట్టలుగా పోసి పరదాలు కప్పినా.. కిందగా వర్షపునీరు చేరి.. కండెలు తడిసి దెబ్బతింటాయని రైతులు వాపోతున్నారు.

# ప్రతి అర్జీకీ ప్రాధాన్యమివ్వాలి

- సమస్యలను పరిష్కరించేలా చర్యలు
- అధికారులకు మంత్రి సురేష్ ఆదేశం



ప్రజల సమస్యలు వింటున్న మంత్రి సురేష్

**ప్రజాశక్తి-మార్కాపురం రూరల్**

వచ్చిన ప్రతి అర్జీకీ ప్రాధాన్యం ఇచ్చి.. ఆయా సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదిమూలపు సురేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కాలేజీ రోడ్డులోని సౌజన్య కల్యాణ మండపంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి స్పందన కార్యక్రమం కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ అధ్యక్షతన ▶ 2లో



చీమకుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## అరుణ పతాక రెపరెపలు

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఎక్కడా ఎనిమిది గంటల పనిదినాలు అమలుకావడం లేదన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ రంగాల్లోనూ ఇదే పరిస్థితి దాపురించిందన్నారు. ప్రైవేటు సంస్థల్లో ఉదయం నుంచీ సాయంత్రం వరకూ 12 గంటలు పనిచేయించుకుంటున్నారని గుర్తు చేశారు. గతంలో పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. పలు చోట్ల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు కూడా మేడే సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతి అర్జీకీ ప్రాధాన్యత ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ స్పందన పిటిషన్లకు పరిష్కారమే అధికార యంత్రాంగం పనితీరుకు నిదర్శనమన్నారు. స్పందనలో అర్జీ ఇస్తే తమ సమస్య పరిష్కారమవుతుందన్న విశ్వాసం ప్రజల్లో ఉందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి దిశా నిర్దేశంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికగా 'స్పందన' కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా అన్ని నియోజకవర్గాలలో స్పందన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే ముందుగా మార్కాపురాన్ని ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 310 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార చర్యలు తీసు కుంటామన్నారు. దీనికోసం సబ్ కలెక్టర్‌ను నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్‌గా నియమించినట్లు తెలిపారు. సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కారమైన తీరును పరిశీలించడానికి ప్రత్యేక బందాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా పిటిషన్లను పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అర్జీలను క్షేత్రస్థాయి అధికారులు పరిష్కరిస్తున్న తీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. బోర్ వెల్స్ ద్వారా భూగర్భ జలాలను విచ్చలవిడిగా వెలికితీయకుండా పర్యవేక్షించాలని చెప్పారు. వేసవి సీజన్ దష్ట్యా భూగర్భ నీటిమట్టం ఇలాంటి చర్యల వల్ల పడిపోకుండా చూడాలని అన్నారు. ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేలా జిల్లా యంత్రాంగం నియోజకవర్గ స్థాయిలో స్పందన కార్యక్రమాలు నిర్వహించడం అభినంద నీయమన్నారు. తొలుత మార్కాపురాన్ని ఎంపిక చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ సిహెచ్.బాలమురళీకష్ణ, సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు, మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సరళా వందనం, లోకేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దుస్తులు అందజేత

**పెద్దదోర్నాల :** దోర్నాల ఎంపిపి గుమ్మ పద్మజ, ఆమె భర్త యల్లేష్ దంపతులు తమ కుమారుని జ్ఞాపకార్థంగా వేసవిలో యోగా శిక్షణ పొందుతున్న 30 మందికి యోగా దుస్తులు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, షేక్. అబ్దుల్‌సలాం, యోగా శిక్షకులు మహేశ్వర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, రామా నాయక్ పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-మార్కాపురం రూరల్**

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. మార్కాపురం మున్సిపాలిటీలోని 20,21వ వార్డుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మహిళలు పూలతో స్వాగతం పలికారు. యువకులు భాజా భజంత్రీలతో బాణా సంచా పేలుస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు మీర్జా షంషీర్ అలీ బేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీ కృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ, 20వ వార్డు కౌన్సిలర్ షేక్ సలీం,21వ వార్డు కౌన్సిలర్ షేక్ భాను, వైసిపి నాయకులు షేక్ కరిముల్లా, బొందిలి బాలజీ సింగ్, షేక్ షేక్షావలి పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

# వైసిపి పాలనకు చరమగీతం పాడాలి : ఉగ్ర

**ప్రజాశక్తి-కనిగిరి**

జగన్ అరాచకపు పాలనకు ప్రజలు చంమగీతం పాడాలని టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక అమరావతి గ్రౌండ్‌లో జగన్ రావణాసుర రాక్షసుడు అనే కార్యమ్రాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ సొంతబాబాయినే హతమార్చేలా చేసిన జగన్ ప్రజలను ఏమైనా చేయగలరని తెలిపారు. మళ్లీ చంద్రబాబునాయుడు సిఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ ఫిరోజ్, నంబుల వెంకటేశ్వర్లు, చింతలపూడి తిరుపాలు, నారాయణ, తమ్మినేని వెంకటరెడ్డి పాల్గొన్నాం **కొండపి :** రాష్ట్ర ముఖ్యమంత్రి జగనాసుర వదే రాష్ట్రానికి శరణ్యమని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జగనాసురవద కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాణాల్లో రాక్షసులు రాజ్యాల్లో నివసించే ప్రజలకు చేటు చేసేవారని తెలిపారు. ఆ కోవల నుంచి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహనన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పిచేస్తూన్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య, తెలుగు యువత కార్యదర్శి దేపూరి మస్తాన్, టిడిపి మండల అధ్యక్షుడు బి.యలమందనాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వసంతరావు, తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి రాయపాటి సీతమ్మ, నాయకులు నరస్సారెడ్డి, నారాయణస్వామి, రామూర్తి నాయుడు, మురళి, సోమయ్య, పెద్దబ్బాయి, వై.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో జగనాసుర అవినీతి నేర రాక్షసుడు పోస్టర్లను చింపి వేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, కామేపల్లి వెంకటేశ్వర్లు, గోళ్ల సుబ్బారావు, మెడబలిమి అచ్యుతరావు, షేక్ మస్తాన్‌వలి, షేక్ వలి, గురిజేపల్లి జిలాని, మంత్రూ నాయక్, షేక్ మాబు, తోటా మహేష్ నాయుడు, చెవుల అంజయ్య, వేగినాటి శ్రీనివాస్, కంచర్ల సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.



జగన్ రావణాసుర రాక్షసుడులో మాజీ ఎమ్మెల్యే ఉగ్ర


నివాళులర్పిస్తున్న నాయకులు

## సిపిఎం సభ్యుడు నరసింహం మృతి

**ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్**

మండల పరిధిలోని పేర్నమిట్ట గ్రామానికి చెందిన సిపిఎం సభ్యుడు పొదిలి నరసింహం (80) సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన ఇటీవల అనార్యోగానికి గురికావడంతో ఒంగోలులోనిఓ ప్రైవేట్ హాస్పిటల్లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మతి చెందాడు. నరసింహంకు భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. నరసింహం మతద్దేహాన్ని సిపిఎం నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె. మాబు , మండల కార్యదర్శి బంకా సుబ్బారావు, మండల నాయకుడు నెరుసుల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు దగ్గుపాటి వెంకటేశ్వర్లు, ఎ.కోటేశ్వరరావు, డి చినబాబు, టి.సుబ్బారావు, యు.రామకష్ణ , కోటిలింగం ఉన్నారు.


కేక్ కట్ చేస్తున్న నాయకులు

## 'తాటిపర్తి' జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి -శింగరాయకొండ**

తాటిపర్తి చారిటబుల్ ట్రస్ట్ అధినేత, వైసిపి నాయకుడు తాటిపర్తి చంద్రశేఖర్ జన్మదిన వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు కేక్ కట్ చేసి చంద్రశేఖర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైసిపి వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, వైసిపి పట్టణ కన్వీనర్ షేక్ పటేల్, వైసిపి నాయకులు యన్నబత్తిన వెంకటేశ్వర రావు ,శీలం రాము, ముల్లపూడి సత్యనారాయణ, షేక్ సలీం బాషా, షేక్ సలీమ్, డాక్టర్ బి. బ్రహ్మయ్య, బాషా, వార్డు సభ్యులు పొట్లూరి సునీత, షేక్ కరీం,షేక్. ముజిబ్, షేక్ కరీం, అబ్దుల్ ఖాదర్ బాషా, వైసిపి మహిళా నాయకురాలు ఇండ్ల సుజాత, తన్నీరు భారతి, మురళి ,సవలం కోటేశ్వరరావు, చేవురి కోటి, గౌడపేరు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎపిఎంగా హనుమంతరావు

**ప్రజాశక్తి-ముండ్లమూరు**

ముండ్లమూరు వెలుగు ఎపిఎంగా హనుమంతరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎపిఎంగా పనిచేస్తున్న టి.హనుమంతరావు టంగుటూరుకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఒంగోలు కార్యాలయంలో పనిచేస్తున్న హనుమంతరావు ఇక్కడ విధుల్లో చేరాడు.

## భాష్యం స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**శింగరాయకొండ :** శింగరాయకొండలోని షాదీఖానాలో జిల్లాస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ పోటీల్లో 200 మంది క్రీడా కారులు పాల్గొన్నారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను శింగరాయ కొండ భాష్యం స్కూలు సాధించారు. టంగుటూరు భాష్యం స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఒంగోలు పివిఆర్ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలు తిరుపతిలో 23,24,25 తేదీల్లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరుకానున్నారు. విజేతలకు భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ రాధాకష్ణ ఖాదర్ బాషా బహుమతులు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు వరికూటి యెహొషున, సెక్రెటరీ మణికంఠ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు.

## వైద్యశాలకు కుర్చీల బహూకరణ

**ప్రజాశక్తి-చీమకుర్తి**

చీమకుర్తిలోని వైఎస్ఆర్ అర్బన్ ప్రభుత్వ ఆసుపత్రికి మద్దిపాడు ఎఎంసి మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి 40 కుర్చీలు సోమవారం బహూకరించారు. ఆసుపత్రిలో రోగులు కూర్చొనేందుకు ఇబ్బందులు పడుతున్నారని వైద్యులు జంగా వెంకటేశ్వరరెడ్డి మారం వెంకారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన వెంకారెడ్డి వైవి. సుబ్బారెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటు హాస్పిటల్‌లో చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం రూ.25వేల విలువైన 40 కుర్చీలు బహూకరించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్య బృందం మారం వెంకారెడ్డిని సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది రాజేశ్వరి, ఖాజావలి, రాజేష్, శివ,భవాని, నాయకులు మారం వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, రాములు, శింగారెడ్డి, శ్రీని వాసులరెడ్డి, గోపిచంద్‌రెడ్డి, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

## న్యాయ అవగాహన సదస్సు

**దర్శి :** మహిళలు తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకుని వాటి కోసం పోరాటం చేయాలని మున్సిపల్ కమిషనరు వై.మహేష్ అన్నారు. మేడే సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు సుబ్బారెడ్డి, మనోహరమ్మ మాట్లాడుతూ మహిళలు అన్నివిధాలుగా అభివృద్ధి చెందాలంటే చట్టంలోని హక్కులు, బాధ్యతలుగురించి తెలుసుకోవాలన్నారు. నేడు మహిళలు విద్యారంగంలోను, రాజకీయ రంగంలోను రాణిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాలటీరులు, వివిఎలు, మహిళలు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ కార్యాలయం ప్రారంభం

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**

గిరిజన మహిళల్లో రక్తహీనత నివారణకు అంగన్‌వాడీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. మార్కెట్ యార్డు భవనంలో ఏర్పాటు చేసిన ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ జిల్లాలు పునర్విభజన జరిగిన తర్వాత ఇప్పటి వరకూ మార్కాపురం రూరల్ ప్రాజెక్టులో పరిధిలోనున్న పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల అంగన్‌వాడీ కేంద్రాలను దోర్నాల ఐసిడిఎస్ ప్రాజెక్టులో కలిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్‌రెడ్డి, జడ్‌పిటిసి లతాబాయి, దోర్నాల సర్పంచి చిత్తూరి హారిక, సిడిపిఒ పద్మావతి, వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, మాజీ ఎంపిపి జోగి వెంకట నారాయణ, సర్పంచులు దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, మూలా రమణారెడ్డి, నాయకులు వెన్నా కాశిరెడ్డి, అమ్మిరెడ్డి రామిరెడ్డి, షేక్ అబ్దుల్ మజీద్ పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా ఏర్పడి ఏడాది నిండినా..

# సమగ్రాభివృద్ధి చర్యలు శూన్యం

## నిధులు విడుదల చేయాలని పలువురి విన్నపం ● నేడు బాపట్ల జిల్లా అభివృద్ధి మండలి సమీక్షా సమావేశం

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

నేడు బాపట్ల జిల్లా అభివృద్ధి మండలి సమీక్షా సమావేశం కలెక్టరేట్‌లో జరుగనుంది. నూతనంగా జిల్లా ఏర్పడ్డాక జరుగుతున్న మూడో సమావేశం ఇది. జిల్లా ఏర్పడి ఏడాది నిండింది. అయినా జిల్లా సమగ్రాభివృద్ధికి చేపట్టిన చర్యలు లేవు. ప్రధానంగా అన్ని అభివృద్ధి పనుల అమలుకు సంబంధించి నిధుల కొరత జిల్లాను వెనుకబాట పట్టిస్తోంది. దీంతో జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు నేటికీ బాలారిష్టాలు దాటింది లేదు. అన్ని నియోజకవర్గాల్లో సమస్యలు కోకొల్లలుగా కొలువుతీరి ఉన్నాయి. సమీక్షలు, వీడియో కాన్ఫరెన్స్‌లు, పర్యటనలతో జిల్లా అధికారులు హడావిడిగా ఉంటున్నారు తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలు మాత్రం అలానే ఉంటున్నాయి. కనీసం రైతాంగం ఎదుర్కొంటున్న సమస్య పంట కాలువలు, మురుగు కాలువల్లో ఉండిపోయిన తూటు కాడను కూడా రెండేళ్లుగా తొలగించలేని దుస్థితి జిల్లాలో ఉంది. జిల్లా కేంద్రంతో పాటు అన్ని నియోజక వర్గాల్లో ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణం కొలిక్కి రాలేదు.

**సౌకర్యాల లేమితో జిల్లా కార్యాలయ భవనాలు**

పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా జిల్లాలను ఏర్పాటు చేసింది. కాని జిల్లా ఏర్పడి ఏడాది నిండినా జిల్లా కేంద్రంలో మౌలిక సదుపాయాల కల్పన అనేది జరగలేదు. జిల్లా ఏర్పడ్డాక అందుబాటులో ఉన్న మానవ వనరుల కేంద్ర భవనాలు, క్వార్టర్లలో జిల్లా కార్యాలయాలను ఏర్పాటు చేశారు. కాని నేటికీ కావలసిన మేరకు వసతుల కల్పన సమకూరలేదు. గతంలో నిర్మించిన ప్రభుత్వ క్వార్టర్లలో ఏర్పాటు చేసిన కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్, ఎస్‌పి కార్యాలయాలు మాత్రం సౌకర్యాలతో అందుబాటులో కొచ్చాయి. నిధులు అందుబాటులోకి రాకపోవడంతో జిల్లా అధికారులు ఉసూరుమంటూ విధులు నెట్టుకొస్తున్నారు. నూతనంగా జిల్లా కార్యాలయ భవనాల కోసం స్థల సేకరణ నేటికీ జరగలేదు. జిల్లా సమగ్రాభివృద్ధి చెందాలంటే రవాణా, విద్య, వైద్యం, వ్యవసాయం, తాగునీరు లాంటి రంగాలపై



బాపట్ల జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న సర్పంచ్‌లు

దృష్టి పెట్టాలి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం జరగాలి. ఇందుకు నిధులు కావాలి. జిల్లా కేంద్రంలో అన్ని సౌకర్యాలతో జిల్లా వైద్యశాల ఏర్పాటు కావాల్సి ఉంది. బాపట్ల, చీరాలలో ప్రాంతీయ వైద్యశాలలు ఉన్నాయి. కాని అత్యవసర వైద్యసేవల కోసం గుంటూరు లేదా విజయవాడ వెళ్లాల్సి వస్తోంది. బాపట్లలో రూ.550 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల, 300 పడకలతో బోధనాసుపత్రి, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అవి ఎప్పటికి అందుబాటులోకి వస్తాయో అర్థంకాని స్థితి నెలకొంది. అలానే జిల్లా పరిధిలో విజయవాడ-చెన్నై జాతీయ రహదారి ఉంది. నార్కెట్‌పల్లి- అద్దంకి ఎక్స్‌ప్రెస్ హైవే ఉంది. వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారి ఉంది. ఈ రహదారుల్లో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అత్యవసర చికిత్స కోసం జిల్లా కేంద్రం బాపట్లతో పాటు అద్దంకి, మార్టూరు, పర్చూరుల్లో ఉన్న వైద్యశాలల్లో ట్రామాకేర్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. జిల్లా కేంద్రానికి రవాణా సదుపాయం అంతంత మాత్రంగా ఉంది. బాపట్లకు ప్రజలు సులభతరంగా వచ్చేందుకు వీలుగా నియోజకవర్గ కేంద్రాలు ముఖ్యమైన గ్రామాల మీదుగా ఆర్‌టిసి బస్సు సర్వీసులు నడపాలి. ఉద్యోగులు, ప్రజల సౌకర్యార్థం గుంటూరు, తెనాలి నుంచి బాపట్లకు నాన్‌స్టాప్ బస్సు సర్వీసులు నడపాలి. జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య పంట పొలాలకు సాగు నీరందకపోవడం. పంట కాలువలు, మురుగు కాలువల్లో విపరీతంగా తూడుకాడ పెరిగిపోయింది. కాలువల్లో పూడికలను తీయలేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నిధులు లేక ఈ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. బాపట్ల జిల్లా పర్యాటక రంగానికి అనుకూలమైంది. 74 కిలోమీటర్ల సముద్రతీరం ఉంది. ప్రకృతి సిద్ధమైన మడ అడవులు ఉన్నాయి. సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్‌లు ఉన్నాయి. తీరంలో ఉన్న ప్రభుత్వ భూముల్లో రీసార్టుల ఏర్పాటు ద్వారా మరింతగా ఆదాయం సమకూరుతుంది. వాయుసేనకు చెందిన మ్యూజియం ప్రతిపాదనలు ఉన్నాయి. దీంతో పాటు పలురకాల పార్కు నిర్మాణాల ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవలసిఉంది.

**నెరవేరని గత సమావేశం నిర్ణయాలు**

గతేడాది డిసెంబరు 6న జరిగిన జిల్లా అభివృద్ధి మండలి సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున పాల్గొని జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా జరుగుతోందన్నారు. నిధులు సత్వరమే మంజూరవుతాయన్నారు. కాని నేటికీ అరకొరగానే నిధులు వస్తున్నాయి. కాంట్రాక్టర్లు పనులు చేయలేని పరిస్థితి ఉంది. జిల్లాలో నాడు-నేడు కార్యక్రమంలో గ్రామ సచివాలయ భవనాలు, ఆర్‌బికెలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్, బల్క మిల్క్ యూనిట్స్ నిర్మాణాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కాని ఈ ప్రభుత్వ భవనాలకు సంబంధించి ఏడాది కాలంగా బిల్లులు విడుదల కాలేదు. జిల్లాకు దాదాపు రూ.20 కోట్ల బిల్లులు రావలసి ఉంది. జిల్లాలో జల జీవన్ మిషన్ పథకం కింద చేపట్టిన పనులు నిధుల లేమిలో ముందుకు సాగడం లేదు. తుఫాను పంట నష్ట పరిహారం నగదు అరకొరగానే ఇచ్చారు. ప్రధానంగా గ్రామ పంచాయతీలు నిధులు లేక కునారిల్లిపోతున్నాయి. నేడు జరుగుతున్న జిల్లా అభివృద్ధి మండలి సమావేశంలో అయినా జిల్లా సమగ్రాభివృద్ధికి నిధుల మంజూరుకు అవకాశం లభిస్తుందేమో చూడాల్సి ఉంది.

## కోనేటిపురంలో అక్రమంగా మట్టి తవ్వకాలు

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

మండలంలోని కోనేటిపురం గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా పంచాయతీ చెరువులో అధికార పార్టీ నాయకులు అక్రమ మట్టి తవ్వకాలకు పూనుకున్నారు. సుమారు 4 ఎకరాలకు పైగా ఉన్న ఈ చెరువులో దాదాపు రెండు నుంచి మూడు మీటర్ల లోతున జేసిబిలతో మట్టి తవ్వకాలు చేపట్టి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. గత మూడు రోజులు జరుగుతున్న ఈ అక్రమ తవ్వకాలతో గ్రామంలో రహదార్లు ఛిద్రమయ్యాయి. సోమవారం కురిసిన వర్షానికి గ్రామ ప్రధాన రహదారి బురదమయంగా మారి గ్రామస్థుల రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది. ఏమాత్రం వాహనదార్లు ఆదమరిచినా వాహనాలు జర్రునజారి కిందపడి గాయాల పాలవుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టి తవ్వకాలకు మైనింగ్, రెవెన్యూ, పంచాయతీ అనుమతి పొందాల్సివుంది. కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే అధికారులకు ముడుపులు చెల్లించి యథేచ్ఛగా అక్రమ



చెరువు మట్టిని ట్రాక్టర్‌లో నింపుతున్న జెసిబి



మట్టి తోలకాలతో బురదమయంగా మారిన రహదారి

తవ్వకాలు చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నిత్యం ఈ చెరువులో పశువులు నీరు తాగుతూ సేదదీరుతూ ఉంటాయని, మీటర్ల కొద్దీ లోతుగా తవ్వటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టిని జగనన్న కాలనీకి తోలాలనే పేరుతో చెరువులో చేపట్టిన తవ్వకాలతో ఎక్కడా కాలనీకి ట్రక్కు మట్టిని తోలకుండానే దాదాపు వెయ్యి ట్రక్కులకు పైగా అక్రమంగా అమ్ముకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ మట్టి తవ్వకాలలో అధికార పార్టీకి చెందిన మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు తెర వెనుక ఉండి నడిపిస్తున్నట్లు అనుమానం వ్యక్తం అవుతోంది. దీని కారణంగానే యథేచ్ఛగా సాగుతున్న ఈ తవ్వకాల వైపు అటు పోలీస్ యంత్రాంగం కానీ, రెవెన్యూ, మైనింగ్ అధికారులు గాని కన్నెత్తి చూడటం లేదని గ్రామస్థుల నుంచి బలంగా వినిపిస్తుంది. ఇప్పటికయినా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ తవ్వకాలపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి-వేటపాలెం**

స్థానిక ఓరుగంటి రెడ్డిలంప జంక్షన్ రోడ్డులో భూపతి మస్తాన్‌రావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు స్మారక చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు సోమవారం 250 మందికి మజ్జిగ పంపిణీ చేశారున. ఈ చలివేంద్రాన్ని భూపతి ఆంజనేయులు వెంకాయమ్మ దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి దాహార్తిని తీర్చడానికి ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయడం ఎంతో సంతోషదాయకమని చెప్పారు. వేసవిలో మజ్జిగ తాగటం ఎంతో ఆరోగ్యకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్, సాయి, శివ రామకృష్ణ, త్రివిక్రమ్, భారతి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

## 'స్పందన' ఫిర్యాదులు పరిష్కరించాలి: ఎస్పీ

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

స్పందన ఫిర్యాదులు చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు వారి సమస్యలను స్వయంగా ఎస్పీకి విన్నవించుకొన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, "స్పందన" ఫిర్యాదులు చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. 'స్పందన' ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నిర్ణీత సమయంలో నివేదికను అందించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ రోజు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వరకట్నం వేధింపులు, కుటుంబ సమస్యలు, భూవివాదాలు, ఆర్థికపరమైన లావాదేవీల సమస్యలు, ఇతర సమస్యలతో మొత్తం 38 మంది ఫిర్యాదుదారులు వారి సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి మహేష్, డిసిఆర్‌బి డిఎస్‌పి జి లక్ష్మయ్య, స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ వి మాలకొండయ్య పాల్గొన్నారు.



"స్పందన" నిర్వహిస్తున్న బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్

## నగర శివారులో కాలిన మృతదేహం

**ప్రజాశక్తి-ఒంగోలు క్రైం**

కాలిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఒంగోలు నగర పరిధిలోని జాతీయ రహదారి పక్కన పిఎల్‌ఆర్ కల్యాణ మండపం వెనుక చెట్లలో సోమవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 20 నుంచి 25 సంవత్సరాల వయసుగల వ్యక్తి కాలిపోయిన మృతదేహాన్ని తుమ్మ చెట్ల మధ్య గేదెల కాపరులు గుర్తించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాలూకా పోలీసులు అక్కడకు చేరుకొని పరిశీలించారు. ఎవరైనా హత్య చేసి.. మృతదేహాన్ని అక్కడ తగలబెట్టారా? లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. సుమారు రెండు రోజుల క్రితం ఈ ఘటన జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం చుట్టుపక్కల వాటర్‌బాటిల్స్, పర్సు లభ్యమయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని ట్రైనీ ఐపిఎస్ అంకిత సురానా, తాలూకా సిఐ ఆర్ రాంబాబు పరిశీలించారు. ఇది హత్యా, ఆత్మహత్యా అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.



చోరీకి గురైన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

## మద్దులూరులో భారీ చోరీ

**ప్రజాశక్తి- సంతనూతలపాడురూరల్**

మండల పరిధిలోని మద్దులూరు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన గడ్డం వీరయ్య తన ఇంట్లోని బీరువాలో దాచిన రూ.13 లక్షల నగదును గుర్తుతెలియన వ్యక్తులు అపహరించారు. బాధితుడు గడ్డం వీరయ్య అదే గ్రామానికి చెందిన చెన్నారెడ్డి సింగారెడ్డితో కలిసి పొట్టేళ్ల వ్యాపారం చేస్తున్నారు. ఇటీవల వారు పొట్టేళ్లను విక్రయించగా రూ.13 లక్షలు వచ్చాయి. ఆదివారం రాత్రి వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వీరయ్య తన ఇంటికి తాళాలు వేసి సమీపంలోని తమ బావమరిది అనుమోలు సురేష్ ఇంటిలో ఇన్వర్టర్ ఉండడంతో అక్కడికి వెళ్లాడు. అర్ధరాత్రి వీరయ్య తమ ఇంటికి వచ్చి పండుకున్నాడు. మళ్లీ కొంతసేపటి తరువాత బావమరింది ఇంటికి వెళ్లి పడుకున్నాడు. ఈ క్రమంలో దిండు కింద ఉంచిన ఇంటి తాళాలను మర్చిపోయాడు. సోమవారం వీరయ్య ఆయన భార్య నాగవల్లి సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు తీసి ఉన్నాయి. అనుమానంతో లోనికి వెళ్లి పరిశీలించగా బీరువా తలుపులు తెరిచిఉన్నాయి. బీరువాలోని నగదు కనిపించలేదు. ఈ మేరకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఒంగోలు డిఎస్‌పి నాగరాజు, ట్రైనీ ఐపిఎస్ అంకిత స్వర్ణమహావీర్, ఒంగోలు రూరల్ సిఐ శ్రీనివాస్‌రెడ్డి, సంతనూతలపాడు ఎస్‌ఐ ఆంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్, సిసిఎస్ బృందం దొంగతనం జరిగిన ఇంటిని, ఆ పరిసరాలను పరిశీలించారు. స్థానిక ఎస్‌ఐ ఆంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

## టెక్నాలజీతో కూడిన విద్యతో అభివృద్ధి

**ప్రజాశక్తి-పంగులూరు:** గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు టెక్నాలజీతో కూడిన విద్యను అందించడం ద్వారా, గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, రైతు సంఘం నాయకులు పెంట్యాల హనుమంతరావు అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన, చందలూరు విద్యా, విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభ సందర్భంగా సోమవారం ఉదయం జరిగిన సభలో హనుమంతరావు మాట్లాడారు. చందలూరు విద్యా విజ్ఞాన కేంద్రం ఈ చుట్టుపక్కల గ్రామాల యువకులకు విజ్ఞాన కేంద్రంగా మారాలని ఆయన కోరారు. ప్రస్తుత సమాజంలో కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోతే ఉపాధి అవకాశాలు లేవని, గ్రామీణ యువత తప్పనిసరిగా కంప్యూటర్ పరిజ్ఞానం పొందాలని హనుమంతరావు కోరారు.

# పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

## ఘనంగా మేడే దినోత్సవం ● పలుచోట్ల ఎర్ర జెండా ఆవిష్కరణ



బాపట్లలో సిఐటియు ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



చీరాలలో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో మేడే



నగరంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకుడు మణిలాల్

**ప్రజాశక్తి-బాపట్ల**

పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ అన్నారు. బాపట్లలో సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన మేడే వేడుకల్లో వారు మాట్లాడారు. మేడే సందర్భంగా బాపట్లలోని పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం పతాకాన్ని జిల్లా పార్టీ కార్యదర్శి సిహెచ్ గంగయ్య ఆవిష్కరించారు. సిఐటియు పతాకాన్ని ఆ సంఘం జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ ఆవిష్కరించారు. బాపట్ల పట్టణంలో పలుచోట్ల సిఐటియు పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. మేడే సందర్భంగా కార్మిక వర్గం కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ప్రతిన పూనాలన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, అంబేద్కర్ సర్కిల్, రైల్వేస్టేషన్ మీదుగా సాగి తిరిగి పాత బస్టాండ్ చేరుకుంది. ఈ ర్యాలీలో అంగన్‌వాడీలు ఎజిబిటెక్, ఏజీ ఫామ్, ఆటో వర్కర్లు, హమాలీలు, ఆర్టీసీ రంగాల కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, వై భాస్కరరావు, సిఐటియు నాయకురాలు సుభాషిణి, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్య, మనోజ్, బాపట్ల పట్టణ సిఐటియు నాయకులు జె శామ్యూల్, బుచ్చిరాజు, శ్రీనివాసరావు, నిరంజన్, లక్ష్మణ, బాబు పాల్గొన్నారు.

**ఉప్పరపాలెంలో మేడే పతాకావిష్కరణ**

ఉద్యమాలకు పురిటిగడ్డ అయిన బాపట్ల పట్టణంలోని ఉప్పరపాలెంలో అరుణ పతాకాన్ని ఆవిష్కరించి మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎంఉప్పరపాలెం శాఖ కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని, పార్టీ సభ్యులు రాజు వెంక రెడ్డి, అక్కల రంగారెడ్డి, సుబ్బారెడ్డి, పలువురు పార్టీ సానుభూతిపరులు పాల్గొన్నారు.

**చీరాల:** కార్మికుల సమస్యల పరిష్కారం పోరాటాలతోనే సాధ్యమవుతుందని సిఐటియు నాయకులు అన్నారు. సోమవారం అంతర్జాతీయ మేడే దినోత్సవ సందర్భంగా సోమవారం సిఐటియు చీరాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు చీరాలలో ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో కూరగాయల మార్కెట్, ఐఎల్‌టిడి యూనియన్, మున్సిపల్ కార్యాలయం, సిఐటియు కార్యాలయం, గడియార స్తంభం సెంటర్, టాక్సీ డ్రైవర్ యూనియన్, ఫోర్ వీల్స్ ఆటో, ఏపీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్, హైర్ బస్ వర్కర్స్ యూనియన్, ఎల్ఐసి యూనియన్ పలుచోట్ల జండా ఆవిష్కరణ నిర్వహించారు. సిఐటియు జెండాను సిఐటి కోశాధికారి ఆర్‌విఎస్ రామిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎన్ బాబురావు మాట్లాడుతూ కార్మికులు ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించిన కార్మిక చట్టాలను దేశంలో నరేంద్రమోడీ ప్రభుత్వం కాలరాస్తోందని అన్నారు. మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం ఏకమై మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి వసంతరావు కమిటీ సభ్యులు సింగయ్య, ఝాన్సీ, కెవిపిఎస్ నాయకులు జయరాజు, జనవిజ్ఞాన వేదిక నాయకులు కుర్రా రామారావు, కె యోహాన్, జి సుధీర్, జి నాగేశ్వరరావు, బి ఝాన్సీ, రామారావు, డి నారపరెడ్డి, ఎస్‌కె కాలేషా, పట్టణ ప్రజా సంఘాల నాయకులు, బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు జి సుజీవన తదితరులు పాల్గొన్నారు.

**వేటపాలెం:** మండలంలోని దేశాయిపేట పంచాయతీ సిలోన్ కాలనీలో జరిగిన మేడే సభలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు పి కొండయ్య మేడే సందర్భంగా కాలనీలో పెయింటర్స్ యూనియన్ యూత్ కమిటీ శ్రీమారి ముత్తు అమ్మన్ దేవస్థానం కమిటీ కలిసి ప్రజలందరూ పాల్గొని మేడే సవరణ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పి కొండయ్య మాట్లాడుతూ చికాగో మృతవీరుల ఆశయాలను కొనసాగించాలని అన్నారు. యూత్ కమిటీ నాయకులు వినోద్, పుష్పరాజు, మోహన్‌రాజ్, శివ నాడియన్, సత్తి, వేలు, నరేష్, మహిళా నాయకురాలు సువర్ణమాల సెల్వరాజ్, సిల్విస్టర్ తదితరులు పాల్గొన్నారు.



సంతమాగులూరు మండలం గురిజేపల్లిలో మేడే కార్యక్రమం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

**పోరాటాల్లో భాగస్వాములు కావాలి**

ప్రజా వ్యతిరేక విధానాలపై జరిగే పోరాటాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జెవివి జిల్లా కార్యదర్శి కుర్ర రామారావు అన్నారు. సోమవారం మేడే దినోత్సవం వేడుకల్లో భాగంగా ఆయన వేటపాలెం గ్రామపంచాయతీలో నిర్వహించిన మేడే వేడుకలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం స్థానిక గడియార స్తంభం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేటపాలెం మండల సిఐటియు అధ్యక్షులు మచ్చ అయ్యప్పరెడ్డి, కార్యదర్శి బ్రహ్మయ్య, ట్రజరర్ సురేష్, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

**చెరుకుపల్లి:** ప్రపంచ కార్మికుల దినోత్సవం అయిన మేడే దినోత్సవ కార్యక్రమాన్ని చెరుకుపల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. చెరుకుపల్లి, గుల్లపల్లి, రాంబొట్లపాలెం కనగాల తదితర గ్రామాలలో అరుణ పతాకాలు రెపరెపలాడాయి. కార్యక్రమాలలో సిఐటియు అనుబంధ సంస్థలు, తాపీ, ఆటో తదితర యూనియన్ల ఆధ్వర్యంలో అరుణ పతాక జెండాలను ఎగురవేసి కార్మిక ఐక్యతను చాటారు. కార్యక్రమాలలో అధిక సంఖ్యలో కార్మిక సంఘాలు పాల్గొని జయప్రదం చేశాయి.

**సంతమాగులూరు:** గ్రానైట్ క్వారీలలో ఉన్న టిమ్మర్లను తొలగించి స్థానిక కార్మికులకు క్వారీ యజమానులు ఉపాధి కల్పించాలని, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా, మండలంలోని గురిజేపల్లి గ్రామంలో సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన గురిజేపల్లి గ్రానైట్ వర్కర్స్ యూనియన్ కార్మికులు అంబేద్కర్ సెంటర్‌లో కార్మిక జెండా ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ సచివాలయం ప్రాంగణంలో యూనియన్ అధ్యక్షులు పెరుమాళ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో తంగిరాల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిరుగు గాబ్రియేలు, ఆశీర్వాదం, డిఎస్ రెడ్డి, పాండు, బాబు, కోటి, పుల్లారావు పాల్గొన్నారు.

**భట్టిప్రోలు:** ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భట్టిప్రోలు ప్రజా సంఘాల కార్యాలయంలో సిఐటియు మండల కార్యదర్శి జి సుధాకర్, అద్దేపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మురుగుడు సత్యనారాయణ, ఐలవరంలో చేనేత నాయకులు దీపాల సత్యనారాయణ జెండాలను ఆవిష్కరించగా అమృతలూరులో నాయకులు బి అగస్టీన్ వివిధ రంగాలలో పని చేసే కార్మికులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. మండల కేంద్రం చుండూరులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు టి కృష్ణమోహన్ మేడే జండాను ఆవిష్కరించి మేడే ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు పాల్గొన్నారు.

**అద్దంకి:** పట్టణంలోని అభ్యుదయ నగర్ సుందరయ్య భవనంలో సోమవారం మేడే సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు కె రఘుచంద్ ఎర్ర జెండాను ఆవిష్కరించారు. మేడే సందర్భంగా పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక పురపాలక సంఘం కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యోగ, కార్మికులు ఎర్రజెండాను ఆవిష్కరించి కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఫ్రూట్ అండ్ వండర్స్ ఆధ్వర్యంలో, మరియు రిక్షా కార్మికులు స్థానిక భవాని సెంటర్లో, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు తిరుపతిరెడ్డి ఆవిష్కరించి మేడే సందర్భంగా పలువురు వక్తలు వారి అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి వెంకట్రావు, తంగిరాల వెంకటేశ్వర్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పంగులూరు:** మేడే సందర్భంగా పంగులూరులో అరుణ పతాకాన్ని సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్‌బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు దేవరకొండ రాముడు, పఠాన్ అబ్దుల్లా, పఠాన్ బాజీబాబు, పంచాయతీ పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు సంపంగల వెంకట్రావు, నూతలపాటి బాబురావు, తలపనేని రామారావు, సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు శ్రీనివాసరావు, హరిబాబు పాల్గొన్నారు.

**కారంచేడు:** ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా సోమవారం కారంచేడు కాల్వ సెంటర్లో, చీరాల రోడ్డులో ఉన్న ఆర్సీఎం చర్చి వద్ద మేడే జెండా సిఐటియు మండల అధ్యక్షులు అనిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిఐటియు జిల్లా నాయకులు పి కొండయ్య, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు బయ్య శంకర్ మేడే ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ రంగాల నుంచి కార్మికులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చిట్టెమ్మ, రాణి, పేరమ్మ, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

**కొల్లూరు:** కొల్లూరు బస్టాండు సెంటర్‌లో సోమవారం ఆటో వర్కర్స్ యూనియన్, రిక్షా వర్కర్స్ యూనియన్, మెకానిక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే పతాకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ కార్మికవర్గం ఏకమై ప్రజా వ్యతిరేక మోడీని గద్దె దించాలని కోరారు. తోకలవానిపాలెం, గాజులంక, చిలుమూరు, అనంతవరం తదితర గ్రామాలలో అరుణ పతాకాన్ని ఎగరవేశారు. తిప్పలకట్టలో మాజీ సర్పంచ్ పంపగాని నాగమల్లేశ్వరరావు జెండా ఎగరేశారు. సిపిఎం ఆఫీసులో అమృతలూరు కృపానందం, తోకలవారిపాలెంలో గ్రామ సర్పంచ్ టి కృష్ణమోహన్, చిలుమూరులో బొనిగల సుబ్బారావు జెండాలను ఆవిష్కరించారు.

**మార్టూరు రూరల్:** మండల కేంద్రం మార్టూరులో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు బత్తుల హనుమంత రావు ఆధ్వర్యంలో స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. హక్కులను హరించడానికే కార్మిక చట్టాలను సవరించారని, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవడానికి కార్మికులందరూ ఐక్యంగా ముందుకు రావాలని ఈ సందర్భంగా బత్తుల హనుమంతరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పాలపర్తి రామాంజనేయులు, బండారు ఆదినారా యణ, పోపూరి సునీల్ కుమార్, షేక్ షబ్బీర్, విశ్రాంత ఎంఈఓ పిచ్చయ్యశర్మ, విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు షేక్ కమాలుద్దీన్, ఎనికపాటి రాంబాబు, బొడెంపుడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**సిపిఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో..**

సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ కేంద్ర కమిటీ సభ్యులు షేక్ మహ్మద్ బాషా ఆధ్వర్యంలో స్థానిక గన్నవరం రోడ్డులో మేడే వేడుకలు నిర్వహించారు. కార్మిక హక్కులను రక్షించుకోవడానికి కార్మిక వర్గం సంఘటిత పోరాటాలకు సిద్ధమవ్వాలని బాషా పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సుజాత, బొల్లాపల్లి బెంజిమన్, కమాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

**నగరం:** నగరం మండల కేంద్రంలో సీఐటీయూ జండా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె ఝాన్సీ, నగరం మండల నాయకులు ఎన్ కృష్ణకుమారి, ఏవిపీకె సుబ్రమణ్యం, జి మరియదాసు, ఎం చంద్రం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**నిజాంపట్నం:** మేడే సందర్భంగా ప్రపంచ కార్మికుల దినోత్సవ వేడుకలను ఆదివారం మండల కేంద్రమైన నిజాంపట్నంలో మోగదరమ్మ తల్లి ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సీఐటీయూ జెండాను ఆటో యూనియన్ అధ్యక్షులు జి ఎలీషా, ఎస్ఎఫ్ఐ నిజాంపట్నం మండల అధ్యక్షుడు ఎన్ శివశంకర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిజాంపట్నం మండల కేంద్రంలో కార్మికులు, ఆటో యూనియన్, సిఐటియు నాయకులు డి బాలకృష్ణారెడ్డి, వి నవీన్, ఏ చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పర్చూరు:** ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పర్చూరు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. పర్చూరు బొమ్మల సెంటర్‌లో, అడుసుమల్లి సివిల్ సప్లై గోడౌన్ వద్ద, మార్కెట్ కమిటీ యార్డు ఆవరణలో మేడే వేడుకలు నిర్వహించారు. నల్లమడ రైతు సంఘం నాయకులు నరిశెట్టి ఆచార్యులు మేడే జెండాను ఆవిష్కరించారు. జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి బండి శంకరయ్య మాట్లాడారు. కార్యక్రమంలో నాగులపాలెం, ఇందిరా కాలనీల్లో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు బి చినదాసు, ఎం డేవిడ్, సివిల్ సప్లైస్ జిల్లా కార్యదర్శి రత్నరాజు, కె రామారావు, భవన నిర్మాణ కార్మికులు షేక్ షంషుద్దీన్, ఉపాధ్యక్షులు టి నాగరాజు, పోతురాజు, కత్తి చంద్రరావు, షుకుర్, ఎన్ శ్రీనివాసరావు, పి జయరావు, సీతారామయ్య పాల్గొన్నారు.

**ఇంకొల్లు రూరల్:** మేడే వేడుకలను ఇంకొల్లు మండలంలోని కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. ఇంకొల్లులో గ్రామ పంచాయతీ కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంరతం గ్రామ పంచాయతీ వద్ద జెండాను యుటిఎఫ్ జిల్లా నాయకులు భవనం శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికులు పోరాడి సాధించుకున్న పలు ఉద్యమాలను గురించి వివరించారు. సభకు సిఐటియు మండల కార్యదర్శి నాంగడ్ల వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఇంకొల్లు మండలంలోని వంకాయలపాడులో మేడే జెండాను వంకాయలపాటి ఇస్రాయేలు బాబు మేడే జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యర్రం గోవిందరెడ్డి, గద్దల మహేష్‌బాబు, సత్యానందం, రంగారావు, వెంకటేశ్వర్లు, శ్యామ్, కోటయ్య, రాఘవేంద్రరావు, అబ్రహాం, నాగరాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మేడే స్ఫూర్తితో సమరశీల ఉద్యమాలు

## సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు పిలుపు

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

ప్రపంచ కార్మిక వర్గం హక్కుల కోసం రక్తం చిందించిన రోజు మేడే అని, ఆ స్ఫూర్తిగా దోపిడీకి వ్యతిరేకంగా పోరాడే శక్తులన్ని సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా సిపిఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్‌పై అరుణ పతాకాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గం అనేక హక్కులను, చట్టాలను రక్తతర్పణ తోనే సాధించుకున్నదన్నారు. రోజుకు 15, 18 గంటలు పనిచేస్తూ, కనీస సౌకర్యాలు, వేతనాలు దక్కక, దుర్మార్గమైన దోపిడీకి గురవుతున్న కార్మిక వర్గం సంఘటితమై 1886లో చేసిన పోరాటాల ఫలితమే మేడే అని తెలిపారు. 137 సంవత్సరాల క్రితం అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పని దినం, కార్మిక వర్గ హక్కుల కోసం వీరోచిత పోరాటాలు సాగాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గం త్యాగాలతో సాధించుకున్న హక్కులు, చట్టాలకు నేడు ప్రమాదం ఏర్పడిందన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ, కార్మిక వర్గానికి, కష్టజీవులకు అనుకూలంగా ఉన్న చట్టాలకు సమాధి కడుతున్నాడన్నారు. 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా కుదించి, 8 గంటల పని దినం స్థానంలో 12 గంటలకు పెంచే చట్టాలు చేస్తున్నారన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య మాట్లాడుతూ ప్రపంచ కార్మిక దీక్షాదినం మేడేను నేడు ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారన్నారు. అదే సందర్భంలో దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, నిస్వార్థ ప్రజా నాయకుడు అమరజీవి. పుచ్చలపల్లి సుందరయ్య 110 జయంతి నేడని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు, నగర కార్యదర్శి జి.రమేష్, కార్మిక కర్షక ప్రజా సంఘాల నాయకులు బి.వెంకట్రావు సిహెచ్.జయప్రకాష్, ఎస్‌డి.షమ్మీ, కంకణాల వెంకటేశ్వర్లు, ఎస్‌కె.అమీర్, జి.రవి కుమార్, కె.గురుస్వామి, టి.ప్రవీణ్, శశాంత్, హేమంత్, కోటయ్య పాల్గొన్నారు.



ఒంగోలులో జెండా ఆవిష్కరిస్తున్న పూనాటి ఆంజనేయులు, తదితరులు



పామూరులో మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్



పొదిలిలో మాట్లాడుతున్న ఎం. రమేష్

**సిఐటియు ఆధ్వర్యంలో అన్నదానం**

మేడే సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులకు అన్నదానం నిర్వహించారు. ఒంగోలు బైపాస్ సెంటర్ 49వ డివిజన్‌లో సిఐటియు జెండాలు, సుందరయ్య భవన్ రోడ్ లో స్ట్రీట్ వెండర్స్ యూనియన్ జండాలు ఆవిష్కరించారు అనంతరం బైపాస్ రోడ్‌లో జరిగిన సభకు సిఐటియు నాయకులు సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా సిఐటియు నగర ఉపాధ్యక్షుడు జి.రమేష్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం 8 గంటల పని దినం నుండి 12 గంటల కోసం చట్టాలు చేయడానికి సిద్ధపడుతున్నాయన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అన్నదాన కార్యక్రమాన్ని సిఐటియు నాయకులు బి.ముసలారెడ్డి, ఒంగోలు నగర అభవద్ధి కమిటీ కార్యదర్శ టి. భక్తసింగ్ రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ.లక్ష్మీనారాయణ, ఆదిశేషయ్య, డి.వెంకటేశ్వర్లు మాలకొండయ్య ఎం.శ్రీనివాసులు, పి.సుబ్బారావు, డి.కోటేశ్వరరావు, ఎం.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

**యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మేడే**

యుటిఎఫ్ ఒంగోలు ప్రాంతీయ మండలాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఉద్యమ పతాకాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి వీరాంజనేయులు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఒంగోలు పట్టణ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, యుటిఎఫ్ ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రవి, జిల్లా మహిళా సహాధ్యక్షురాలు ఉమామహేశ్వరి, యుటిఎఫ్ క్రాంతి మండలాల కార్యదర్శి వెంకట్రావు, సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఇరిగేషన్ కార్యాలయంలో...**

ఇరిగేషన్, ఆర్ అండ్ బి వర్క్ చార్జ్డ్ సర్వీస్ రిటైర్డ్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కె. రామమోహనరావు, కె. వీరరాఘవ స్వామి, బివి.శేషయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు. మేడే సందర్భంగా కలెక్టర్ కార్యాలయం వద్ద అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో వినూత్న ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మ, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.రాజశేఖర్, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు జాలన్న, అంజయ్య, జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు రంగారావు, తిరుమలరావు పాల్గొన్నారు.

**పామూరు :** మేడే స్ఫూర్తితో రైతు, కార్మిక, కర్షక ఐక్య పోరాటాలు నిర్వహించాలని సిఐటియు జిల్లా నాయకుడు సయ్యద్ హనీఫ్ తెలిపారు. సిఐటియు ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు రోడ్‌లో ఆటో డ్రైవర్ యూనియన్ జండా ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్మికులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ మాట్లాడుతూ చికాగో నగరంలో ఎనిమిది గంటల పని కోసం జరిగే పోరాటంలో అసువులు భాసిన అమరుల స్ఫూర్తితో ఐక్య పోరాటాలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కొమ్మలపల్లి మాల్యాద్రి, అధ్యక్షుడు షేక్ మస్తాన్, శేఖర్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు రజియా పాల్గొన్నారు.

**పొదిలి :** మేడే స్ఫూర్తితో ఐక్య పోరాటాల ద్వారా కార్మికుల హక్కులను పరిరక్షించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ తెలిపారు. మేడే సందర్భంగా మున్సిపల్, సివిల్ సప్లయ్, బజారు ముఠా, చెక్క రిక్షా, ఫ్రూట్ మర్చంట్స్, ఆర్‌టిసి, బిల్డింగ్, ఆటో, ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ జెండాలు ఆవిష్కరించారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి పెద్ద బస్టాండ్, రథంరోడ్డు, శివాలయం మీదుగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా సహధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి షేక్‌అబ్దుల్ హై, పి.బాలవెంకటేశ్వర్లు, సిఐటియు మండల కార్యదర్శి బి.కోటేశ్వరావు, మున్సిపల్ వర్కర్స్ అధ్యక్ష కార్యదర్శులు జి.నాగులు, డి.సుబ్బయ్య, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పొదిలి డిపో అధ్యక్ష కార్యదర్శులు వేణు, ఎం.సురేష్, సివిల్ సప్లయ్ హమాలీల సంఘం నాయకులు కె.శేషయ్య, కె.ప్రసాద్, ఫ్రూట్ మర్చంట్స్ నాయకులు సుబాని, జిలాని, మస్తాన్, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు ఆర్.తిరుపతయ్య, వెంకట నరసయ్య, చెన్నకేశవులు, ముఠావర్కర్స్ నాయకులు ఆర్. గురవయ్య, వెంకట్రావు, ఆటో వర్కర్స్ యూనియన్ రమేష్, నగేష్, విఒఎల సంఘం నాయకుడు కపారావు తదితరులు పాల్గొన్నారు.

**చీమకుర్తి :** మేడే సందర్భంగా సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో గ్రానైట్ గనులు,కంకర మిల్లులు, నిప్పట్లపాడు, వివిధ ప్రాంతాలలో మేడే జండాలు ఆవిష్కరించారు. ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్ నుంచి పోస్టాఫీసు సెంటర్ వరకూ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నాశనం చేసి, నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు బి.వీరాంజనేయులు, పల్లాపల్లి ఆంజనేయులు, పూసపాటి వెంకటరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఇట్టా నాగయ్య,టిశ్రీను, యోహాన్, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు బిందె ఆంజనేయులు, ఎన్‌ఎస్‌పి వర్క్‌ఛార్జ్డ్ యూనియన్ నాయకులు అశోక్, కంకర ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రభుదాసు,ఎలక్ట్రికల్ యూనియన్ నాయకులు శ్రీను పాల్గొన్నారు. దాచూరిరామిరెడ్డి భవనంలో యుటిఎఫ్ కార్యాలయం ఆవరణలో జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అక్బర్, చలువాది శ్రీనివాసరావు,కోశాధికారి పర్వతం వెంకటేశ్వర్లు, సహాధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు బి. వసంతరావు, ఎస్‌కె.శిలార్, ఎస్.ప్రసాదు ,రాము పాల్గొన్నారు. **సంతనూతలపాడు రూరల్ :** మేడే సందర్భంగా మైనంపాడు, పేర్నమిట్ట సంతనూతలపాడు, ఎండ్లూరు గ్రామాల్లో జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకుడు బంకా సుబ్బారావు, నాయకులు భగత్ సింగ్, ఎస్‌కె.కమాల్, రాము, ప్రసాద్, వెంకటేశ్వర్లు , తిరుపాలు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె. మాబు పాల్గొన్నారు. **మద్దిపాడు :** మోడీని గద్దెదించితేనే దేశం అభివృద్ధి చెందుతుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పునాటి ఆంజనేయలు తెలిపారు. మేడే సందర్భంగా ఏడుగుండ్లపాడులోని ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం వద్ద బ్యూరో ఇన్‌ఛార్జి ఎస్‌వి.బ్రహ్మం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పునాటి మాట్లాడుతూ నిరంకుశ, మతోన్మాద బిజెపిని ఇంటికి సాగనంపాలన్నారు. ఈ కార్యక్రమమంలో ప్రజాశక్తి మేనేజర్ ఎంఎల్‌వి.ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# బిజెపి విధానాలను వ్యతిరేకించాలి

## యుటిఎఫ్ సీనియర్ నాయకుడు మీగడ వెంకటేశ్వరరెడ్డి

**పిసిపల్లి :** మేడే స్ఫూర్తితో ఐక్య ఉద్యమాలు చేపట్టి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని యుటిఎఫ్ సీనియర్ నాయకులు మీడగ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. సిఐటియు మండల మహాసభ రత్నకుమారి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పని గంటలు తగ్గించాలని, 1886 మే 1న చికాగో నగరంలో జరిగిన మహత్తర పోరాటమే మేడే అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను నాలుగుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. ప్రభుత్వ రంగం సంస్థలను కార్పోరేట్ శక్తులకు అమ్మి ప్రవేటీకరణ వైపు మరియు మతత్వ శక్తులను రెచ్చగొట్టి లౌకిక తత్వానికి తూట్లు పొడుస్తుందన్నారు. సిఐటియు సీనియర్ నాయకుడు జివి.కొండారెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్మికుడు ఐక్య ఉద్యమాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వాలు కనీస వేతనం ఇవ్వకుండా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఉద్యోగుల శ్రమను దోపిడీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై.సత్యవతి, మధ్యాహ్న భోజనం పథకం జిల్లా కార్యదర్శి పి.కల్పన, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు, పోస్టల్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీరావలి, అంగన్‌వాడీ యూనియన్ కొండపి ప్రాజెక్టు యూనియన్ నాయకురాలు ఎం.పోలమ్మ, యుటిఎఫ్ జిల్లా నాయకులు ఎ. పోతులూరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మీగడ వెంకటేశ్వరరెడ్డి

# వీల్ చైర్స్ బహూకరణ

**ప్రజాశక్తి-కనిగిరి**

కనిగిరి ప్రభుత్వాసుపత్రిలోని డయాలసిస్ సెంటర్‌కు టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సోమవారం వీల్ చైర్స్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఉగ్ర డయాలసిస్ సెంటర్‌లోని రోగులను పరామర్శించారు. అనంతరం ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుల కొరత ఏళ్ల తరబడి వేధిస్తున్నా పట్టించుకోకపోవటం దారుణమన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైద్యశాలను అన్ని విధాల అభివృద్ధి చేసి కనిగిరి ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృసి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'ఓలా' ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభం

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

భారతదేశపు అగ్రగామి విద్యుత్ వాహన కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ తన వ్యాపార విస్తరణలో భాగంగా రాష్ట్రంలోని ఇతర నగరాలతో పాటుగా ఒంగోలులో తన మొదటి అనుభవ కేంద్రాన్ని (ఇసి) స్థానిక శివాజీ నగర్‌లో ప్రారంభించింది. ఈ కేంద్రంలో కస్టమర్లు ఓలా ఎస్1, ఎస్1 ప్రో స్కూటర్లను టెస్ట్ రైడ్ చేయడానికి, కొనుగోలు ప్రక్రియ నిపుణుల మార్గదర్శనం తీసుకోవడానికి వీలు కల్పిస్తోంది. కస్టమర్లు ఓలా యాప్ ద్వారా వారి కొనుగోలును ఖరారు చేసుకోవడానికి ముందు వారి ఆర్థికసహాయ ఆప్షన్లపై వివరమైన సమాచారం పొందగలుగుతారు. ఓలా ఇప్పుడు 2,50,000 కస్టమర్ల కమ్యూనిటీకి వారి సర్వీస్ ఆవశ్యకతలు, అవసరాలన్నింటిని అందించేందుకు కేవలం 20 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఓలా 51 శ్రేణి లోని ప్రతి వేరియంట్, అత్యాధునికమైన టెక్నాలజీ, సాటిలేని పనితీరుతో జత కలిసి ఒక చక్కని డిజైన్ కలిగి ఉంది 30 శాతానికి పైగా మార్కెట్ వాటాతో ఓలాను అగ్రగామి ఎలక్ట్రిక్ టూ వీలర్ తయారీదారుగా మొదటి స్థానంలో నిలిపింది. ఓలా గణనీయంగా ముందడుగు వేస్తోంది. ఈ అనుభవ కేంద్రాల జోడింపుతో, కంపెనీ రాబోవు రోజుల్లో 500 స్పర్శా కేంద్రాలను చేరుకునే మార్గంలో పయనిస్తోంది.

# చలివేంద్రం ప్రారంభం

**సంతనూతలపాడు రూరల్:** మేడే సందర్భంగా మండల పరిధిలోని మైనంపాడు గ్రామంలో విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచి దాట్ల రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.కె మాబు మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో మంచి నీటి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులోని మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బంకా సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, విజ్ఞాన కేంద్రం బాధ్యులు కె.హనుమంతరావు, భగత్ సింగ్, షేక్ కమాల్, షేక్ నాయబ్, జివి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# విజయశ్రీలో రాయితీతో వైద్యం

**ప్రజాశక్తి-ఒంగోలు**



పరీక్షిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

దేవరకొండ సుబ్బయ్య మెమోరియల్ ఎడ్యూకషన్ సొసైటీ మరియు విజయశ్రీ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక విజయశ్రీ హాస్పిటల్‌లో రైస్ కార్డుదారులకు 50 శాతం రాయితీతో సోమవారం వైద్య సేవలందించారు. ఓపీ విభాగంలో 54 మంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారని డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఓపీ, ఇతర టెస్టులలో మొత్తం రూ.56,900 రాయితీ ఇచ్చినట్లు చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీన రాయితీతో వైద్యసేవలందిస్తామని పేర్కొన్నారు.

# వాడవాడలా మేడే వేడుకలు

**ప్రజాశక్తి -శింగరాయకొండ**

మేడే సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో కందుకూరు రోడ్డు, శాంతి థియేటర్, కొండపి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయం, సివిల్ సప్లయ్ గోడౌన్ వద్ద జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో టంగుటూరి రాము, చిమట సుబ్బారావు, ఇమామ్ , నక్క శ్రీనివాసరావు,మురళి,ఆనంద్.తదితరులు పాల్గొన్నారు. **హనుమంతునిపాడు :** బస్టాండ్ సెంటర్‌లో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ చట్టం కూలీల సంఘం నాయకుడు కత్తి మత్తయ్య,వ్యసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ మండల కార్యదర్శి కత్తి ఏబు, వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ సభ్యులు గురునాథం పాల్గొన్నారు. **తర్లుపాడు :** ఆశా వర్కర్ల సంఘం జిల్లా నాయకురాలు ఎం.బాలమ్మ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఏరువ పాపిరెడ్డి, సిఐటియు నాయకులు జె.నాగరాజు, ఒ.శ్రీనివాసులు, మండల కోఆప్షన్ మెంబర్ షేక్ అక్బర్‌అలీ, జిఎంపిఎస్ నాయకుడు మర్రి వెంకటేశ్వర్లు, ఫేక్ నాగూర్‌వలి పాల్గొన్నారు. **కొనకనమిట్ల :** ఎంపిడిఒ కార్యాలయం వద్ద సిఐటియు జెండాను మండల నాయకులడు ఆరికట్ల శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు. **పొన్నలూరు :** కార్మికులకు బానిస సంకెళ్ల నుంచి విముక్తి కోసం నిర్వహించిన పోరాటాల్లో ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితమే మేడే అని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వినోద్ తెలిపారు. మేడే సందర్భంగా తహశీల్దార్ కార్యాల యం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో జెండాను ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వి.చిన్నబాబు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై.సత్యవతి, రామకష్ణ, మధురవాణి, పోలమ్మ గౌతమి పాల్గొన్నారు. **టంగుటూరు :** పంచాయతీ కార్యాలయం వద్ద జెండాను ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ వేసుపోగు మోజెస్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరి రాము, సర్పంచి మద్దిరాల మమత, పంచాయతీ కార్యదర్శి నర్రా జగదీష్ బాబు, ఉప సర్పంచి మక్కెన కోటేశ్వరరావు, నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, నాగశ్రీను, వెంకట్రావు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మాచర్ల–మర్కాపురం 565 జాతీయ రహదారిపై సిఐటియు జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు డికెఎం.రఫీ, నాయకులు టంగుటూరి సత్యనారాయణ, షేక్ అమీర్ బాషా, భూమని వెంకటేశం, కాశి, రమేష్, వెంకటేశ్వర్లు, రమణ, రవణమ్మ, ఆదిలక్ష్మీ, పాల్గొన్నారు. **త్రిపురాంతకం :** మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల కోసం ఉద్యమిద్దామని సిఐటియు జిల్లా నాయకుడు బి. రఘురాం తెలిపారు. మేడే సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పి. నాగేశ్వరరావు, లక్మణమూర్తి, బివి. నరసింహారావు, దమ్ము చెన్నకేశవులు, రాజారామయ్య, లాబాన్, పిచ్చయ్య, జ్యోతి, నాగమల్లేశ్వరి, రాజు, ఖాశిం, మహంకాళి, గాలిరెడ్డి, ఈశ్వర రెడ్డి, బాలు పాల్గొన్నారు. **పెద్దదోర్నాల :** సిఐటియు , ఎఐటియుసి, రిక్షా కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, పంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో జెండాలు ఆవిష్కరించారు. **జరుగుమల్లి :** నర్సింగోలు, జరుగుమల్లి, చింతలపాలెం గ్రామాలలో జండాలు ఎగుర వేశారు. నర్సింగోలు లోని విద్యుత్ సబ్ స్టేషను వద్ద సిఐటియు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్బంగా కందుకూరు విద్యుత్ డిఇ వీరయ్య తాడు లాగుడు పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో





కనిగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సిఐటియు జిల్లా కార్యదర్శి గంటనపల్లి శ్రీనివాసులు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి దండె రవికుమార్, సిఐటియు మండల అధ్యక్షుడు బెజవాడ శివయ్య, సుబ్బారావు పాల్గొన్నారు. చింతలపాలెంలో సిపిఎం నాయకులు తన్నీరు సుబ్బారావు ఎర్ర జండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి.మోజెస్ ,టి.వెంకట్రావు, కెవి. శేషయ్య, బెల్లం రమణయ్య, జి.అంకయ్య పాల్గొన్నారు. **ముండ్లమూరు :** తశీల్దారు కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెల్లంపల్లి ఆంజనేయులు, బోడపాటి హనుమంతరావు, ఏడుకొండలు, రామాంజనేయులు పాల్గొన్నారు. **కురిచేడు :** సిఐటియు ఆధ్వర్యంలో మేడే నిర్వహిచారు. తొలుత పంచాయతీ కార్యాలయం వద్ద సిఐటియు జెండాను పంచాయతీ కార్మికుడు కమ్మిలి అశోక్ ఎగురవేశాడు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకురాలు షేక్ ఫాతిమా, సిఐటియు మండల నాయకులు సందు వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్మికులు సాల్మన్, లూకయ్య, గురవయ్య, ఆశా కార్యకర్తల సంఘం నాయకులు ఎం. నాగమల్లేశ్వరి, యోగేశ్వరమ్మ పాల్గొన్నారు. **దొనకొండ :** మేడే సందర్భంగా బస్టాండ్ సెంటర్, సివిల్ సప్లయ్ గోడౌన్ వద్ద జండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, కర్నా హనుమయ్య, కుందుర్తి అనిల్, కొండా యేసుదాసు, కె.కిరణ్, బాలకోటయ్య, లూకయ్య, సంతోష్, నాతాన్, దావీదు, ఆశీర్వాదం, వెంకటేశ్వర్లు, రామయ్య, నరసింహారావు పాల్గొన్నారు. **గిద్దలూరు రూరల్ :** సిఐటియు తహశీల్దారు కార్యాలయం వద్ద యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రంగారెడ్డి సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య, సిఐ టియు మండల అధ్యక్షుడు జి. పద్మ, ప్రధాన కార్యదర్శి బి.నర్సింహులు, ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాసులు ,వై. రమేష్ పాల్గొన్నారు. **కొండపి :** మేడే సందర్భంగా అంగన్‌వాడీ భవనం , తహశీల్దారు కార్యాలయం, ఆర్‌టిసి బస్టాండు, జాళ్లపాలెం రోడ్డు, హెచ్‌పి గ్యాస్ గూడెం వద్ద సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కొండపి డివిజన్ కార్యదర్శి జి.వందనం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కెజి. మస్తాన్, సిఐటియు మండల కార్యదర్శి వై.రూబెను, మల్లెల చిన్నపేతురు, రెడ్డెమ్మ, కోటిరెడ్డి, పూర్ణయ్య, సుధాకర్, రవణమ్మ, సులోచన, ఇస్తేరమ్మ, వై.కోటేశ్వరరావు, ఏల్చూరి శ్రీను పాల్గొన్నారు. పెరిదేపిలో ముప్పరాజు శేషయ్య విజ్ఞాన కేంద్ర వద్ద సిపిఎం జెండాను సిపిఎం మండల కార్యదర్శి కె.జి మస్తాన్ ఎగరవేశారు. మిట్టపాలెంలో సిపిఎం జెండాను సిపిఎం శాఖా కార్యదర్శి గడ్డం సురేష్ ఎగుర వేశారు. **మార్కాపురం రూరల్ :** మేడే సందర్భంగా మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో సిఐటియు జెండాను ఎగరవేశారు. అనంతరం అసువులు బాసిన కార్మికులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు దగ్గుపాటి సోమయ్య కోరారు. జవ్వాజి రాజు, డికెఎం.రఫీ, పి.రూబెన్, షేక్ జాబ్బర్, సిఐటియు జిల్లా నాయకులు డి.సోమయ్య, మార్కాపురం పట్టణ కార్యదర్శి పందిటి రూబెన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుమ్మా బాలనాగయ్య, సుబ్బరాయుడు, ఇమాం సాహెబ్,రూబెన్, జవ్వాజి రాజు, ముఠా వర్కర్స్ యూనియన్ వెంకట్రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రాంబాబు, సిఐటియు నాయకులు కరీముల్లా ,డివైఎఫ్ఐ నాయకులు కొండయ్య , ఏనుగుల సురేష్ కుమార్, ఎస్‌ఎఫ్ఐ నాయకులు లోకేష్, విజయ్ కుమార్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, వెంకటరావు పాల్గొన్నారు. **దర్శి :** మేడే సందర్భంగా సిపియం కార్యాలయం వద్ద నాగేశ్వరరావు, జాన్, గడియారస్తంభం సెంటర్‌లో కాలేబాషా, జాలా సుశీల, అంకాల నాగయ్య జెండాఎగుర వేశారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో హనుమంత ˊరావు, జూపల్లి కోటేశ్వరరావు, రమేష్‌బాబు, కరుణానిధి జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కెవి.పిచ్చయ్య, ఉప్పు నారాయణ, మోహన్‌రావు, బేగం, సుబ్బమ్మ, ఎఐటియుసి నాయకులు వెంకటేశ్వర్లు, అరుణ పాల్గొన్నారు. తాళ్లూరులో బోడపాటి హనుమంతరావు, బాలకోటయ్య, వెంకటేశ్వర్లు, రామారావు, ఆశా వర్కర్లు జెండాను ఎగరవేశారు. **సిఎస్.పురం :** కార్మిక జెండాను సిఐటియు నాయకులు ఎస్.తిరుపతిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.ఏసురత్నం, కరిముల్లా, ఎం.శ్రీను, రామ లింగయ్య, రత్నం పాల్గొన్నారు .**నాగులుప్పలపాడు :** చదలవాడ సిఐటియు నాయకులు జి.బసవపున్నయ్య, సంజీవరావు సిఐటియు జెండాను ఆవిష్కరించారు నిడమానూరులో సిఐటియు మండల నాయకుడు శ్రీకాంత్ జెండాను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ఊదరగుడి ప్రసాదు, పంచాయతీ కార్మికులు శ్రీను,కోటయ్య, సుబ్బారావు, అంకరాజు, ఇందిర పాల్గొన్నారు. **కొత్తపట్నం :** మేడే సందర్భంగా సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, సిఐటియు నాయకులు ఎస్.సోమిరెడ్డి, పిల్లి కష్ణ, కోమట్ల భాగ్యలక్ష్మి, మల్లికార్జున, నాగేంద్రం పాల్గొన్నారు. **మద్దిపాడు :** మండల పరిధిలోని మద్దిపాడు, దొడ్డవరం గ్రామాల్లో మేడే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి, ఆటో యూనియన్ అధ్యక్షుడు బేగ్, ఖాజా, దర్శి హుసేన్,ఉబ్బా వెంకటేశ్వర్లు, వీరా స్వామి, అంజయ్య, రవి పాల్గొన్నారు. **వెలిగండ్ల :** సిఐటియు కార్యాలయం వద్ద ఇండియన్ గ్యాస్ అధినేత పత్తిపాటి యానాధరావు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కమిటీ సభ్యులు రాయల మాలకొండయ్య, ఎంఆర్‌పిఎస్ మండల నాయకుడు తాతపూడి నాని, సిఐటియు మండల అధ్యక్షులు కె.ఎస్తేరమ్మ, కుకింగ్ సంఘం నాయకులు బుర్ర రత్తమ్మ, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు రాయల రమాదేవి, కటికల వరలక్ష్మి, భవన నిర్మాణ సంఘం నాయకులు పంతగాని నారాయణ, ఇఒఎ సంఘం నాయకులు కె.నాగేశ్వరి, వత్తిదాలసంఘం నాయకులు రాంప్రసాద్, రాయల భాస్కరరావు, అయినకోట రమేష్, మోటార్ మెకానిక్ రాజేష్, సిద్ధయ్య, గ్రామ సేవకుల సంఘం మండల కార్యదర్శి కె.స్రవంతి, కె.నాగవేణి, బాలకృష్ణ పాల్గొన్నారు. **కనిగిరి :** సుందరయ్య భవన్ నుంచి పామూరు బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు చోట్ల సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జివి.కొండారెడ్డి, పిసి. కేశవరావు. ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు ఎస్‌డి. పీరావలి,సిఐటియు నాయకులు ఎస్‌కె. ఖాదర్‌వలి, ఎస్‌కె. ఖాశీంవలి, బషీరా,జి.శ్రీనివాసులు, కొండల్‌రావు, పిచ్చయ్య **ఒంగోలు సబర్బన్ :** మేడే సందర్భంగా కొప్పోలులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం విశ్రాంత బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగి పందిటి కష్ణమూర్తి జెండాను ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగదర అధ్యక్షుడు రాంబాబు, ఆర్‌టిసి ఉద్యోగుల సంఘల జిల్లా కార్యదర్శి పెళ్లూరి శ్రీనివాసరావు, విశ్రాంత బిఎస్‌ఎస్‌ఎల్ ఉద్యోగి వీరగంధం రాంబాబు, రైల్వే యూనియన్ నాయకులు కామ్రేడ్ దమ్మాలపాటి వెంకటేశ్వరు, రైతు సంఘంనాయకుడు శింగంనేని హనుమంతరావు, బొడపాటి రాఘవరావు, గంగాడి నాగేశ్వరరావు, ఆవులమంద వెంకటయ్య, జి.శ్రీనివాస్, ముచ్చువెంకట్రావు, పాటిబండ్ల శ్రీనివాసరావు, గంగాడి సుబ్బారావు, లింగయ్య, షేక్ సిద్ధయ్య, శింగంనేని సుబ్రమణ్యం, మధిర ఆదినారాయణ, వట్టిగుంట అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మార్కాపురంలో జెండా ఎగుర వేస్తున్న నాయకులు,కార్మికులు



కొప్పోలులో మాట్లాడుతున్న సిఐటియు నగర అధ్యక్షుడు రాంబాబు

# ఉపాధ్యాయ ఉద్యమానికి స్ఫూర్తి 'దాచూరి'

**ప్రజాశక్తి-ఒంగోలు**

ఆయన ఉపాధ్యాయ ఉద్యమ కెరటం.. ఉద్యోగ ఉద్యమానికి బాసట.. ఆయనే యుటిఎఫ్ వ్యవస్థాపకులు దాచూరి రామిరెడ్డి.. ఈయన ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకలలో జన్మించారు. విద్యభ్యాసం పూర్తయిన అనంతరం ఆయన నెల్లూరు జిల్లా రాపూరి సమితి మద్దెలమడుగు గ్రామంలో 1958లో ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. ఆ నాటి నుంచి ఉపాధ్యాయ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. 1959లో ఆనాటి రాపూరి సమితి ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ కార్యదర్శిగా ఉద్యమ జీవితం ప్రారంభించారు. 1960 నుంచి 1968 వరకు నెల్లూరు జిల్లా కమిటీ కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం ప్రకాశం జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఉపాధ్యాయ ఉద్యమ నేతగా ఉంటూనే 1970లో ప్రకాశం జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి పరీక్షా విధానంలో నూతన ఒరవడి తెచ్చారు. ఉపాధ్యాయ ఉద్యమంలో వచ్చిన అవకాశవాద ధోరణులను ఎదిరించి చెన్నుపాటి లక్ష్మయ్య ఆశయాలతో ఉద్యమాన్ని నిర్మించాలనే ధ్యేయంతో అప్పూరి వెంకటస్వామి, నాదెళ్ల సీతారామాచారి, సూర్య నారాయణరాజు లాంటి నేతలతో కలిసి 1974 ఆగస్టు 10న ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు.



**ఉద్యమ కార్యకర్తగా..**

యుటిఎఫ్ ఆవిర్భావం నుంచి ఆయన రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తుండేవారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షునిగా 1981 నుంచి 2000 మధ్య సేవలనందించారు. సమరశీల పోరాటాలు నడపటమేకాదు, ఒక్కరోజు సమ్మెతో ఆనాటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావును ఒప్పించి రీగ్రూపింగ్ స్కేల్స్‌పై ఆధారపడిన ఆటోమాటిక్ అడ్వాన్‌మెంట్ స్కేల్ తేవటంలో ఆయన దూరదృష్టి, నాయకత్వ లక్షణంతో పాటుగా సమయస్ఫూర్తి కనిపిస్తుంది.

**ఆదర్శవంతమైన జీవితం..**

నిరాడంబరత, నిజాయితీ, ఆదర్శవంతం కలగలిసిన జీవనశైలి ఆయనది. 16 ఏళ్ల ఉద్యోగ సర్వీసును వదిలి యుటిఎఫ్‌లో పూర్తికాలం కార్యకర్తగా పనిచేశారు. 1982లో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా ఉంటూ తూర్పు రాయలసీమ నియోజకవర్గం నుంచి శాసనమండలి సభ్యులు (ఎంఎల్‌సి)గా గెలుపొందారు. 2007లో మరలా ఎంఎల్‌సిగా విజయం సాధించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సంఘాలు చేసే పోరాటాలను శాసనమండలి వేదికపై ప్రతిబింబించేవారు. శాసనమండలి సభ్యునిగా వచ్చిన అలెవెన్సులన్నీ సంఘానికి జమ చేసి, సంఘం ఇచ్చిన నామమాత్రపు అలవెన్సుతో సాధారణ జీవితం గడిపిన ఆదర్శమూర్తి ఆయన. కార్యకర్తల పట్ల ఎంత ప్రేమగా ఉంటారో క్రమశిక్షణ విషయంలో అంతే కఠినంగా ఉండేవారు. ఎక్కడికి వెళ్లినా వచ్చినా కార్యకర్తల ఇళ్లలో ఉండేవారు. వారి కుటుంబ సభ్యులతో కలిసిపోయేవారు. తనకు సొంత పిల్లలు లేకపోయినా కార్యకర్తల ఇళ్లలో పిల్లలు ఆయన్ని ఆత్మీయునిగా, తాతయ్యగా, మామయ్యగా, భావించేవారు. పాఠశాల, సంఘ సమావేశం, మహాసభ ఏదైనా నిర్ణీత సమయానికి ముందే హాజరయ్యేవారు.

# 15వ ఆర్థిక నిధులను విడుదల చేయాలి

**ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం డిమాండ్ ● సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి**

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

గ్రామ పంచాయతీలకు రావలసిన 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం పిలుపు మేరకు బాపట్ల జిల్లాలోని సర్పంచుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాకు ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం రాష్ట్ర నాయకులు, బాపట్ల జిల్లాలోని సర్పంచులు ఉయ్యూరు అప్పిరెడ్డి, శొంఠి శ్రీనివాస రావు, టి కృష్ణమోహన్, ఏ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత ఆరు నెలల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు విడుదల కావలసిన 15వ ఆర్థిక సంఘం నిధులు ఇంతవరకు విడుదల కాకపోవటం దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి నిధులు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా రాజకీయాలు, పార్టీలకతీతంగా సర్పంచులందరూ ఉద్యమించాల్సి ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇవ్వవలసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2,010 కోట్లు బాకీ రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సి ఉందని, వీటికి తోడు రాష్ట్ర ప్రభుత్వం 5వ ఆర్థిక సంఘం నుంచి మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయాలన్నారు. అలాగే రాష్ట్రంలో కొత్తగా యూనియన్ బ్యాంక్ అకౌంట్స్ గ్రామపంచాయతీ వాళ్ల పీఎంఎఫ్ఎస్ లింకు ఉన్న ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం వాటా వేస్తేనే తాము నిధులు విడుదల



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సర్పంచి సంఘ నేతలు

చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతుందన్నారు. ఈ మధ్యకాలంలో రాష్ట్రంలోని సర్పంచ్‌లు కొంతమంది కలిసి కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ కలిస్తే ఈ మేరకు తెలపడం జరిగిందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రులు గ్రామ పంచాయతీలు పట్ల ప్రేమతో వెంటనే మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేసి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడానికి కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరాహార దీక్షలు, రాష్ట్రంలో విజయవాడ కేంద్రంగా సర్పంచ్‌లందరూ కలిసి నిరాహార దీక్షలు చేస్తామని అన్నారు. అలాగే వేసవి వస్తున్న నేపథ్యంలో మంచినీటి సమస్య పరిష్కారం కోసం ఎక్కువ గ్రామ పంచాయతీల్లో నిధులు లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ కింద గ్రామ పంచాయతీలో గ్రీన్ గార్డ్, గ్రీన్ అంబాసిడర్‌లు ఏర్పాటు చేశారని, వారికి కేంద్ర ప్రభుత్వం సంవత్సర కాలం నుంచి జీతాలు వేయటం లేదని, వెంటనే జీతాలు ఇవ్వాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామ సచివాలయాలు అన్ని పంచాయతీల ఆధ్వర్యంలోనే నడవాలని, సచివాలయంలో వచ్చే ఆదాయాన్ని గ్రామపంచాయతీల అకౌంట్లో వేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన గడప గడపకూ నిధులు గ్రామపంచాయతీ ఆధీనంలోనే ఖర్చు చేయాలని కోరారు. గతంలో కూడా సర్పంచ్‌లకు తెలియకుండానే కరెంట్ బిల్లుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం వేలకోట్ల రూపాయలు నిధులు లాక్కున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కరెంట్ బిల్లుల పేరుతో సర్ చార్జీల వసూలు ఆపాలని, మైనర్ పంచాయతీల కరెంట్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కోరారు. పై సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపకపోతే రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు అందరం గ్రామాల్లోని ప్రజల సహకారంతో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లాలోని పలువురు సర్పంచులు దాది వెంకటలక్ష్మి, సుబ్బారావు, బి అనిల్ కుమార్, పి బాజీ, కూచిపూడి రత్నకుమారి, భాను, కె ఆనందబాబు, రుద్రపాటి శోభారాణి, కె లక్ష్మి కామేశ్వరావు, లక్ష్మీ తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలి: ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి-రేపల్లె**

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఏబిఆర్ కాలేజీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. పరీక్ష ఫీజు కట్టించుకోవాలని ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం స్థానిక తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్య, మనోజ్ మాట్లాడుతూ అటెండెన్స్ సరిపోలేదు అనే కారణంతో విద్యార్థుల వద్ద పరీక్ష ఫీజు కట్టించుకోకపోవడం సరికాదని అన్నారు. ముందుగానే విద్యార్థుల వద్ద కాలేజీ ఫీజు కట్టించుకుని, ఈరోజు పరీక్ష ఫీజు చెల్లింపునకు చివరి రోజు అయినా కూడా పరీక్ష ఫీజు కట్టించుకోకపోవడం, ప్రిన్సిపల్ కాలేజీకి రాకపోవడం ఆయన విధుల పట్ల నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని అన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఫేస్ అటెండెన్స్‌ను తీసుకొస్తే కాలేజీలో మాత్రం ఎక్కడా




నిరసన వ్యక్తం చేస్తున్న రేపల్లె నాయకులు

లేనివిధంగా ప్రతి గంటకు మాన్యువల్ అటెండెన్స్ వేస్తూ మాన్యువల్ అటెండెన్స్‌ను పరిగణలోకి తీసుకుని క్లాస్ టీచర్ ఏది చెప్తే అది ప్రిన్సిపల్ వింటూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. దాదాపు 50 మంది విద్యార్థులకు పైగా ఫీజు కట్టించుకోకుండా నిలిపివేశారని, వీరందరి ఫేస్ అటెండెన్స్‌ను పరిగణలోకి తీసుకుని అందరి చేత పరీక్ష ఫీజు కట్టించుకుని సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు తమ సమస్యను చెప్పుకోవడానికి ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందించిన సందర్భంలో ప్రిన్సిపల్ ముందు కృతజ్ఞతగా నవ్వినందుకు వినతిపత్రాన్ని చించి ముఖం మీద విసిరివేయడం విద్యార్థుల పట్ల ప్రిన్సిపల్ అహంకార వైఖరి మార్చుకుని విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం తన విధులను నిర్వహించాలని అన్నారు. అపాయింట్‌మెంట్ తీసుకోవాలని విద్యార్థులకు సూచించడం ప్రజాస్వామ్య హక్కులను, విద్యార్థుల ప్రాథమిక హక్కులను అణచివేయడమేనని అన్నారు. ఇప్పటికైనా కళాశాల బృందం, ప్రిన్సిపల్ తమ వైఖరిని మార్చుకుని విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉండాలని, వారి సమస్యలను వినాలని పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల వద్ద వెంటనే పరీక్ష ఫీజు కట్టించుకోకపోతే పెద్దఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రేపల్లె పట్టణ కార్యదర్శి సూర్యప్రకాష్, నాయకులు సతీష్ కుమార్, వెంకటేష్ అమర్‌దీప్, విద్యార్థులు పాల్గొన్నారు.



'గడప గడపకూ' కార్యక్రమంలో మంత్రి సురేష్

## పారదర్శకంగా జగన్ పాలన

### మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**

రాష్ట్రంలో నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందిస్తున్నారని, దీంతో పేదలకు సంక్షేమ లబ్ధి చేకూరిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. సోమవారం సాయంత్రం పెద్దదోర్నాల పట్టణంలోని సచివాలయం-3 పరిధిలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం మంత్రి సురేష్ మాట్లాడుతూ అర్హత ఉండి పింఛన్లు, ఇళ్లు మంజూరుకానివారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేస్తామన్నారు. ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**2024లో వైసిపిదే విజయం**

ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. 2024లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. మా నమ్మకం నువ్వే జగనన్న, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన లభించిందన్నారు. నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి ఇచ్చిన హామీల కంటే అదనంగా ఎన్నో నెరవేర్చానని తెలిపారు. ముఖ్యంగా నియోజకవర్గంలో శాశ్వతమైన అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ చిత్తూరి హారిక, వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, నాయకులు షేక్ అబ్దుల్ మజీద్, గుమ్మా యల్లేష్, అమ్మిరెడ్డి రామిరెడ్డి, ఉప సర్పంచ్ రసూల్, పిఆర్ డీఈ సుబ్బారెడ్డి, హౌసింగ్ డీఈ సురేష్, ఎంపిడివో నాసర్‌రెడ్డి, ఎంఈవో మస్తాన్ నాయక్ పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రవికిరణ్మయి

## ఉపాధి హామీ పనులు ప్రారంభం

**ప్రజాశక్తి-భట్టిప్రోలు:** ఈ ఏడాది జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద కూలీలకు కల్పించాల్సిన పనులను సోమవారం గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి ప్రారంభించారు. ఇప్పటి వరకు వ్యవసాయ పనులలో నిమగ్నమైన కూలీలకు వ్యవసాయ పనులు మందగించటంతో ఉపాధి కోసం ప్రభుత్వం కల్పించిన ఈ పనులను నిబంధనల ప్రకారం పూర్తి చేసి నిర్దేశించిన వేతనం పొందాలని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో టిఏ పి సుధీర్, జెఈ జయ చంద్ర, నాయకులు చెన్నయ్య, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు ఉన్నారు.

## సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోండి

**ప్రజాశక్తి-చెరుకుపల్లి:** ప్రజలు రైతులు తమకు అవసరమైన పాస్ పుస్తకాలు, పిల్లలకు సంబంధించిన సర్టిఫికెట్ల కోసం దళారులను ఆశ్రయించవద్దని, నేరుగా సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే సక్రమంగా ఉన్న ప్రతి దరఖాస్తును పరిష్కరించి మంజూరు చేస్తామని చెరుకుపల్లి తహశీల్దారు మల్లికార్జున రావు పేర్కొన్నారు. సోమవారం తహశీల్దారు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజలే నేరుగా తమ గ్రామ సచివాలయాల్లో సేవలను పొందవచ్చునని అన్నారు. నిర్ణీత సమయంలోగా పరిష్కరించి వారికి సంబంధించిన ధ్రువపత్రాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.


సిఎంను కలిసిన బత్తుల సుప్రజారెడ్డి, డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి కుటుంబం

# ముఖ్యమంత్రి జగన్ దిష్టిబొమ్మ దహనం

## టిడిపి నేత నరేంద్రవర్మ అరెస్ట్

ప్రజాశక్తి-బాపట్ల

'జగనాసుర' కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో సూర్యలంక రోడ్డులోని టిడిపి కార్యాలయం వద్ద సిఎం జగన్ దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. దీంతో పోలీసులు నరేంద్రవర్మను అరెస్టు చేసేందుకు యత్నించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు నరేంద్రవర్మ అరెస్ట్‌ను అడ్డుకున్నారు. కార్యకర్తల వలయాన్ని ఛేదించి పోలీసులు నరేంద్రవర్మను అరెస్ట్ చేసి.. పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యకర్తలు ర్యాలీగా పోలీసుస్టేషన్ వద్దకు చేరుకొని పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నరేంద్ర వర్మను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై పోలీస్‌స్టేషన్ నుంచి విడుదలైన నరేంద్రవర్మ విలేకరులతో మాట్లాడారు. ఏపీ రాజకీయాలలో ఇంత అవినీతిని కలిగిన ముఖ్యమంత్రిని ఎన్నడూ చూడలేదన్నారు. ప్రభుత్వ అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తే.. అక్రమంగా అరెస్టు చేస్తారా.? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, యమ్.శివా, మాజీ ఎంపీపీ యమ్ విజేత, మాజీ మున్సిపల్ చైర్మన్ జి.ప్రమిలారాణి, సలగల రాజశేఖర్, పల్లం సరోజని, బొట్టు కష్ణ, కర్లపాలెం, పివి పాలెం మండల పార్టీ అధ్యక్షులు శంకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


బాపట్లలో సిఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టిడిపి నాయకులు

### జగన్‌ను వైసిపి కార్యకర్తలే నమ్మట్లేదు..

**ఒంగోలు కలెక్టరేట్:** సిఎం జగన్మోహన్‌రెడ్డిని వైసిపి కార్యకర్తలే నమ్మటం లేదని, రాష్ట్ర ప్రజలు ఎలా నమ్ముతారని ఒంగోలు తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఒంగోలు నియోజకవర్గ టీడీపీ కార్యాలయం నందు 'జగనాసుర అవినీతి, నేరచరిత్ర'పై జగన్ పది తలలతో ఉన్న బొమ్మతో నిరసన తెలియజేశారు. జగనాసుర అవినీతి, నేరచరిత్రలోని ఒక్కొక్క అంశాన్ని చదువుతూ, ఒక్కొక్క తల చించుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో కొఠారి నాగేశ్వరావు, కామేపల్లి శ్రీనివాసరావు, రావుల పద్మజ, షేక్ కపిల్ బాషా పాల్గొన్నారు.


ఒంగోలులో నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు